క్లుప్తంగా...

నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



లక్డీకాపూల్ : 'సమాజానికి మహిళలు కీలకమని వారికి సాధికారికత కల్పించే దిశగా గ్లోబల్ ఐటీ సర్వీసెస్, డిజిటల్ సొల్యూషన్స్ కంపెనీ(జీఎస్‌పీఏఎన్ఎస్ టెక్నాలజీస్) మహిళా సాధికారికత, యువత నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆ సంస్థ సీఓఓ మోహిత్ మాలిక్ తెలిపారు. ఆదివారం మౌలాలిలోని కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ.. మౌలాలి చుట్టు పక్కల కమ్యూనిటీలకు చెందిన మహిళల అభ్యున్నతికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రంలో ఫ్యాషన్ డిజైనింగ్, మెహందీ డిజైనింగ్, బ్యాగ్ మేకింగ్, బ్యూటీషియన్ కోర్సులు, హెయిర్‌డ్రెస్సింగ్ తదితర జీవనోపాధి నైపుణ్యాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. అంతే కాకుండా యూత్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నుంచి పది మంది పిల్లలు సేల్స్ ఫోర్స్, అడోబ్, చాట్‌జీపీటీ మొదలైన అడ్వాన్స్ కోర్సులను అభ్యసించే అవకాశాన్ని కల్పిస్తున్నామన్నారు. జీఎస్‌పీఏఎన్ఎస్ అధ్యక్షుడు ఏ.పీ గ్రోవర్, సీనియర్ వీపీ రామ ఆలూరి, సెట్విన్, మేనేజింగ్ డైరెక్టర్, కె. వేణుగోపాల్ రావు మాట్లాడుతూ మహిళలందరూ ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మహిళలకు ఉచిత శిక్షణ, ఉపాధి సహాయం అందించనున్నట్లు తెలిపారు.

రూ.8 వేలు డ్రా చేస్తే.. వచ్చింది రూ.600

- హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలో విచిత్ర సంఘటన
- తక్కువ నగదు రావడంతో కస్టమర్ల అయోమయం
- సిబ్బందితో వాగ్వాదం



టెక్నీషియన్‌తో మాట్లాడుతున్న వినియోగదారులు

మల్లాపూర్: మల్లాపూర్ ప్రధాన రహదారిలోని హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎంలో ఆదివారం విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. నగదు డ్రా చేసుకునేందుకు వెళ్లిన వినియోగదారులు రూ.8000 విత్ డ్రా చేస్తే రూ.600 రావడం, మరి కొందరికి రూ. వెయ్యి బదులు రూ.200 నగదు రావడంతో అవాక్కయారు. దాదాపు 20 మంది కస్టమర్లకు ఇదే అనుభవం ఎదురైంది. దీనిపై ప్రశ్నించగా సెక్యూరిటీ, టెక్నిషియన్లు వారి పట్ల దురుసుగా ప్రవర్తించడంతో వినియోగదారులు వాగ్వాదానికి దిగారు. హెచ్‌డీఎఫ్‌సీ టెక్నిషియన్, బ్యాంక్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. వచ్చి కస్టమర్లకు నచ్చజెప్పి ఏటీఎంను మూసివేసి వెళ్లి పోయారు.

చర్చనీయాంశంగా మారిన స్క్రాప్ తరలింపు

కాప్రా: కాప్రా మండలం తహసీల్దార్ కార్యాలయంలోని స్క్రాప్ తరలింపు వ్యవహారం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. తహసీల్దార్ ఆఫీస్‌గా ఉపయోగించుకుంటున్న భవన ఆవరణలో కాప్రా సర్కిల్ కార్యాలయానికి చెందిన పాత సామాన్లు ఉన్నాయి. వాటిలో విలువైన వస్తువులు కూడా ఉన్నట్లు సమాచారం. ఆదివారం ఓ వ్యక్తి ఈ స్క్రాప్‌ను తరలిస్తుండగా సమాచారం అందడంతో మున్సిపల్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. స్క్రాప్ తరలింపును అడ్డుకోగా తహసీల్దార్ అనుమతితోనే తాము తరలిస్తున్నట్లు చెప్పడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే దీనిపై అనుమానాలు వ్యక్తం కావడంతో విషయం తెలుసుకున్న కాప్రా సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎస్. శంకర్ దీనిపై స్పందించారు. తహసీల్దార్ ఆఫీస్ ఆవరణలోని స్క్రాప్ ఉన్న స్థలాన్ని పార్కింగ్ కోసం ఉపయోగించుకుంటామని, అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగిస్తామని తహసీల్దార్ కోరినట్లు డీసీ తెలిపారు. మున్సిపాలిటీకి సంబంధించిన సామాగ్రి ఎవరూ తీసుకెళ్లలేదని వాటిని అక్కడే మరో చోట భద్రపరిచారని డీసీ వివరించారు. జీహెచ్ఎంసీకి చెందిన స్క్రాప్‌ను తొలగించాల్సి వస్తే ఉన్నతాధికారుల ఆమోదంతో బహిరంగ వేలం విధానంలో తొలగిస్తామని డీసీ శంకర్ వివరించారు.

అంబేడ్కర్‌కు పూలమాల

ఘట్‌కేసర్: పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి ప్రబుద్ధ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఆదివారం పూలమాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వంశరాజ్ సంఘం ఘట్‌కేసర్ అధ్యక్షుడు శామల ముత్యాలు అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంబేద్కర్ ఆశయాలు అచరణీయమన్నారు.

బోనం.. వైభోగం



ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి



కట్ట మైసమ్మ దేవాలయంలో నందికంటి శ్రీధర్

ఉప్పల్, మల్కాజిగి డివిజన్‌లో ఆదివారం బోనాల జాతర కనుల పండువగా జరిగింది. తెల్లవారుజాము నుంచే భక్తులు అమ్మవారి ఆలయాలకు పోటెత్తారు. మహిళలు ఇంటి వద్ద బోనాలతో బైలెల్లి అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. శివసత్తులనృత్యాలు ఆకట్టకున్నాయి. సాయంత్రం ఫలహారం బండ్ల వద్ద పోతరాజుల విన్యాసాలు భక్తుల్లో ఉత్సాహం నింపాయి. ఉదయం నుంచి భక్తి పాటలతో అమ్మవారి ఆలయాల పరిసరాలు హోరెత్తాయి. కట్ట మైసమ్మ దేవాలయం, బందరు పోచమ్మ దేవాలయం, బాల సరస్వతీనగర్‌లోని నల్లపోచమ్మ దేవాయలం, మల్కాజిగిరిలోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యేలు మైనంపల్లి, ఈటల రాజేందర్, బీజేపీ మధ్య ప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, కార్పొరేటర్లు శ్రవణ్, ప్రేమ్‌కుమార్, డీసీసీ అధ్యక్షుడు నందికంటి తదితరులు అమ్మవారి దర్శించుకున్నారు. –ఉప్పల్, మల్కాజిగిరి జోన్ బృందం

వైభవంగా నాచారం మహంకాళి బోనాలు



నాచారం మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలను తీసుకువస్తున్న మంత్రి మల్లారెడ్డి



దప్పు కొడుతున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

మల్లాపూర్: నాచారం మహంకాళి ఆలయంలో బోనాల ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి మహిళలు. బోనాలు సమర్పించి, ఒడి బియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. పోతురాజుల విన్యాసాలు , కళాకారుల నృత్యాలు, డప్పు చప్పులు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం తరుపున మంత్రి మల్లారెడ్డి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి, నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్, బండారి లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్య క్రమంలో ఆలయం ఈవో వెంకన్న, ప్రధాన అర్చకులు వేదాంతం నర సింహామూర్తి, తదితరులు పాల్గొన్నారు.



బందరు పోచమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి



ఉజ్జయిని మహంకాళి అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే ఈటల



కామాక్షిపురంలోని అమ్మవారి ఆలయంలో..



బోనమెత్తిన కార్పొరేటర్ శ్రీవాణి





రామంతాపూర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించిన పరమేశ్వర్‌రెడ్డి



అమ్మవారికి బోనం సమర్పిస్తున్న కార్పొరేటర్ బన్నాల గీత



అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న కార్పొరేటర్ భాక్య సుమన్



ఉజ్జయిని మహంకాళి అమ్మవారు



ఉప్పల్ బ్యాంక్ కాలనీలో..



హబ్సిగూడలో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి



మౌలాలిలో పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ సునీత



వినాయక్‌నగర్‌లో ఎమ్మెల్యే ఈటల రాజేందర్ పూజలు



మిర్జాల్‌గూడలో ..



ఓల్డ్ అల్వాల్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి



మీర్‌పేట్ హెచ్‌బీకాలనీలో అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



చర్లపల్లి మారుతీకాలనీలో మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పూజలు

బోన మెత్తిన చిన్నారులు

మల్లాపూర్: తెలంగాణ సంప్రదాయ పండుగగా బోనాల పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉందని అకాడమీ హైట్స్ పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ శివకుమార్ అన్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని నాచారం చౌరస్తాలోని బచ్‌పన్, అకాడమీ హైట్స్ పాఠశాల్లో బోనాల జాతరను నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, బోనాల విశిష్టతను విద్యార్థులకు వివరించారు, విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు, పోత రాజుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. కరస్పాండెంట్ కల్పన, ప్రిన్సి పల్ రష్మి జైశ్వాల్, సంధ్య, అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

దక్కన్ స్ప్రింగ్స్ గ్లోబల్ స్కూల్లో..

నాచారం దక్కన్ స్ప్రింగ్ గ్లోబల్ స్కూల్లో బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల చీఫ్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ పవన్, సాంబ, పాఠశాల ప్రిన్సిపాల్ సుమ మీనన్, కిషోర్ కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమ్య, జానకీ, తదితరులు పాల్గొన్నారు.



అకాడమీ హైట్స్ పాఠశాలలో



కళ్ల ముందే దోచేస్తారు...

సాక్షి,మేడ్చల్ జిల్లా: 'పోచారం మార్కెట్‌లో జ్యోతి 500 గ్రాములు (అరకిలో)టమాటాలు కొనుగోలు చేసింది. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేయిస్తే 460 గ్రాములు చూపిస్తోంది. 40 గ్రాములు నష్టపోయారు. ఈసీఐఎల్ –నాగారం రోడ్డులో కిలో జామకాయలను కొనుగోలు చేయగా, విక్రయదారుడు వాటిని మామూలు త్రాసులో తూకం వేసి ఇచ్చాడు. వాటిని ఎలక్ట్రానిక్ తూకం వేస్తే 890 గ్రాములు మాత్రమే ఉన్నట్లు చూపిస్తోంది. బియ్యం బస్తా 25 కిలోలకు ధర చెల్లిస్తున్నాం. తూకం వేస్తే 24.5 కిలోలు మాత్రమే ఉంటోంది. ఇందులో ఏది నమ్మాలో తెలియక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు.

–వినియోగదారుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న వ్యాపారులు పలు రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. తూకాలు, కొలతల్లో తేడాలు ఉంటున్నా.. చిరునామా లేని చిరుతుండ్లు. ఆహార పదార్థాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నా పట్టించుకునే వారు కరవయ్యారు. అధికారులు నామమాత్రపు తనిఖీలతో మమ అనిపిస్తున్నారన్న విమర్శలు వ్యక్తమ వుతున్నాయి.

తూకాల్లో మోసాలు

- కిలోకు 50 నుంచి వంద గ్రాములు టోకరా
- దుకాణాలు, సూపర్ మార్కెట్లలోనూ చేతివాటం
- కూరగాయలు, చేపల మార్కెట్లలోనూ అదే పరిస్థితి...

◆ కూరగాయల మార్కెట్‌లో...

గ్రేటర్ సహా శివారు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల్లో వారానికి ఒక వాడ, బస్తీ , గ్రామం చొప్పున కూరగాయల అంగళ్లు, చేపల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. అయితే ఇక్కడ తూకాల్లో మోసాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎలక్ట్రానిక్ కాంటా వాడాలని నిబంధనలు ఉన్నప్పటికీ కొందరు వ్యాపారులు పాత రకపు త్రాసు వాడుతూ బండరాళ్లను తూకానికి ఉపయోగిస్తున్నారు. మార్కెట్లో కొనుగోలు చేసిన కూరగాయలను బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే బరువు తక్కువగా ఉంటోంది.

◆ చేపల విక్రయాల్లోనూ చేతి వాటం....

నగరంతో సహా శివారుల్లో చేపల మార్కెట్‌లలో వినియోగదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. లావుపాటి కవర్లలో చేపలు జోకడం, ఎలక్ట్రానిక్ మెషిన్లు కాకుండా పాత రకపు తక్కెడ వాడుతుండటం కనిపిస్తోంది. బయట ఎలక్ట్రానిక్ యంత్రంపై తూకం వేయిస్తే 100 నుంచి 200 గ్రాముల వరకు తేడా వస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. మరికొందరు ఎలక్ట్రానిక్ యంత్రాన్ని లీటర్ మోడ్‌లో పెట్టి తూకం వేస్తున్నారు. అందులో వెయ్యి గ్రాములు కాకుండా వెయ్యి అని మాత్రమే చూపిస్తుంది. లీటర్ మోడ్‌లో ఉంటే పాలు తీసుకుంటే 1000 (లీటరు) ఎంఎల్ చూపిస్తుంది. ఘన పదార్థం తీసుకుంటే (ఉదా: కిలో చేపలు తీసుకుంటే) 900 అని వస్తోంది. గ్రాములా, లీటర్లో తెలియక వినియోగదారులు ఆయోమయానికి గురవుతున్నారు.

◆ సూపర్ మార్కెట్లలో....

కిరాణ దుకాణాలు, కొన్ని సూపర్ మార్కెట్లలో ప్యాకెట్ల రూపంలో విక్రయించే వాటిపై తయారీ, నాణ్యతా ప్రమాణాలు, ఇతర వివరాలు ఉండటం లేదు. ఇష్టం వచ్చినట్లు విక్రయిస్తున్నారు. ఏదైనా వస్తువు, ఆహార పదార్థాలకు సంబంధించిన ప్యాకింగ్ పై ఉదాహరణకు 500 కిలో గ్రాముల ప్యాకెట్‌పై అదనంగా 150 గ్రాములు ఇస్తున్నట్లు ముద్రిస్తున్నారు. నిశితంగా పరిశీలించి ఆఫర్ లేక పోగా ధర ఎక్కువగా ఉంటోంది. ఒకటి కొంటే మరొకటి, ఉచితమంటూ బోర్డులపై ప్రదర్శిస్తూ.. బిల్లు మాత్రం రెండింటికి వేస్తున్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నగరంలో అనేక ఆహార పదార్థాల తయారీ కేంద్రాలు వెలిశాయి. కొందరు వాటిని ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నారు. ఎలాంటి ప్రమాణాలు పాటించడం లేదు. చిప్స్, కారా, మిఠాయిలు, బిస్కెట్లు, బ్రెడ్లు, కేక్‌లు తదితర ప్యాకెట్లపై ఎలాంటి వివరాలు ఉండటం లేదు. గడువు తీరినా, కల్తీ జరిగినా ఎవరికి ఫోన్ చేయాలో తెలియడం లేదు. కస్టమర్ కేర్ వివరాలు, ఫోన్ నెంబర్ లాంటివి ఉండటం లేదు.

వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలి

గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో వందల సంఖ్యలో పెట్రోల్ బంకులు ఉన్నాయి. పెట్రోల్, డీజిల్ పోయించుకునేప్పుడు వాహనదారుడు జీరో రీడింగ్ చూసుకోవాలి. అప్పటికీ పెట్రోల్ తక్కువగా వస్తోందని భావిస్తే తనిఖీ చేసుకోవచ్చు. ప్రతి బంకులో ఐదు లీటర్ల క్యాన్ ఉంటుంది. అందులో ఐదు లీటర్ల పెట్రోలు పోసి పరిశీలించవచ్చు. తక్కువగా వస్తే అధికారులకు ఫిర్యాదు చేయాలి. కల్తీ జరిగిందని అనుమానం వస్తే వారి వద్ద ఉన్న ఫిల్టర్ పేపర్‌ను అడిగి తీసుకోవాలి. దానిపై రెండు చుక్కలు వేస్తే ఆవిరైపోతుంది. కల్తీ ఉంటే పేపర్‌పై మరక అవుతుంది. ఘన, ద్రవ ఆహార పదార్థాలు ప్యాక్ చేసి విక్రయించాలంటే అనుమతి ఉండాలి. ప్యాకింగ్ పూర్తి వివరాలు, డిక్లరేషన్ ఉండాలి. వినియోగదారులు బిల్లులు అడిగి తీసుకోవాలి.

–జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి సత్యనారాయణ, మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా



పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

బీసీలు సంఘటితం కావాలి

రామంతాపూర్ : బీసీలు సంఘటితంగా రాజ్యాధికార సాధనకు కృషి చేయాలని ఉప్పల్ సర్కిల్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు రాపోలు మహేందర్ ముదిరాజ్ అన్నారు. మహేందర్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం స్థానిక బీసీ నేతలు కేట్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీసీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు.

ముగిసిన బీఎల్ఆర్ ఫుట్‌బాల్ టోర్నమెంట్



బహుమతులు అందజేస్తున్న బొంతు రామ్మోహన్

మల్లాపూర్: బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ విజేతలకు బండారి లక్ష్మారెడ్డితో కలిసి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పన్నాల దేవేందర్‌రెడ్డి, శాంతి సాయిజెన్‌శేఖర్, ప్రభుదాస్.మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బన్నాల ప్రవీణ్, కటార్ల భాస్కర్,జంపాల్ రెడ్డి, నిర్వాహకులు షరీఫ్, అబ్దుల్, జూనైడ్ తదితరులు పాల్గొన్నారు.

అజ్ఞాతంలోనే రియల్టర్ తిరుపతిరెడ్డి

- పోలీస్ స్టేషన్ వద్ద కుటుంబ సభ్యుల పడిగాపులు
- తమను పట్టించుకోవడం లేదని ఆవేదన



తిరుపతిరెడ్డి (ఫైల్)

అల్వాల్: స్థల వివాదం విషయంలో ఒత్తిడికిలోనై ఐదు రోజుల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లిన బీజేపీ నాయకులు , రియల్‌స్టేట్ వ్యాపారి ముక్కర తిరుపతిరెడ్డి ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురవుతున్నారు. అల్వాల్ పోలీస్ స్టేషన్ ఎదుట పడిగాపులు కాస్తున్న వారు తిరుపతిరెడ్డి ఆచూకీ కనిపెట్టాలని పోలీసులను కోరుతున్నారు. అల్వాల్‌లో తిరుపతిరెడ్డికి చెందిన స్థలం విషయమై ఆరు నెలలుగా ప్రత్యర్థులతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఐదు రోజుల క్రితంఅల్వాల్ మండల కార్యాలయం వద్దకు వచ్చిన తిరుపతిరెడ్డి కారును అక్కడే వదిలేసి ఆటోలో ఘట్కేసర్‌కు వెళ్లిడు. అక్కడి నుంచి తన స్నేహితుడి సహాయంతో నార్కట్‌పల్లి వరకు వెళ్లినట్లు ఆధారాలు లభించాయి. అయితే ఆతర్వాత తిరుపతిరెడ్డి ఎక్కడికి వెళ్లాడనేది సస్పెన్స్‌గా మారింది. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం అదుపులోకి తీసుకున్న పోలీసులు ప్రశ్నిస్తున్నారు. కానీ ఇంతవరకు ఎలాంటి వివరాలు తెలియరాలేదు. మొదట కిడ్నాప్ కేసుగా భావించిన పోలీసులు అనంతరం తిరుపతిరెడ్డి తానే స్వయంగా అజ్ఞాతంలోకి వెళ్లాడని సీసీ కెమెరాల ద్వారా వెల్లడయినట్లు తెలిపారు. అయితే కుటుంభ సభ్యులు ఆరోపన మరోలా ఉంది. స్థల వివాదంపై పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిచడం, కోర్టులో కేసు ఇప్పట్లో తేలదని భావించిన తిరుపతిరెడ్డి ప్రత్యర్థుల బెదిరింపులను తట్టుకోలేక అజ్ఞాతంలోకి వెళ్లి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇదే అదునుగా భావించి ఏమైనా అనుకోని సంఘటనలు జరుగవచ్చునని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అతడి ప్రత్యర్థులు, రాజకీయ శక్తుల ప్రయేయంతోనే తిరుపతి రెడ్డి ఆచూకీ తెలియడం లేదని వారు ఆరోపిస్తున్నారు. పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని తిరుపతిరెడ్డి ఆచూకీ బయటపెట్టాలని కోరుతున్నారు. కాగా తిరుపతిరెడ్డి పోలీసుల అదుపులోనే ఉన్నాడని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

బెల్ట్ షాప్ నిర్వాహకుల అరెస్టు



స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

ఉప్పల్: బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న పలువురు వ్యకులను ఉప్పల్ పోలీసులు అరెస్టు చేసిన సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పల్ అజమత్ నగర్, కల్యాణపురి, రామంతాపూర్ తదితర ప్రాంతాల్లో కొందరు వ్యక్తులు బెల్ట్ షాపులు ఏర్పాటు చేసి అక్రమంగా మద్యం సీసాలను విక్రయిస్తున్నారు. దీనిపై సమాచారం అందడంతో ఉప్పల్ పోలీసులు ఏక కాలంలో వారి ఇళ్లపై దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. చిలుకానగర్ ప్రాంతానికి చెందిన బేసు యాకయ్య, పాశకంటి వినోద్ కుమార్, బైరి అంజయ్య, ఉప్పల్ పారిశ్రామిక వాడకు చెందిన బండారి అంజయ్య, కల్యాణపురికి చెందిన చిన్న మల్లేష్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 2 లక్షల విలువైన మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.